క్లుప్తంగా

గర్భిణులకు సామూహిక సీమంతాలు



గర్భిణులకు పండ్లు అందజేస్తున్న ఎంపీపీ లత, తదితరులు

వర్గల్(గజ్వేల్): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని వర్గల్ ఎంపీపీ లతరమేశ్‌గౌడ్ అన్నారు. పోషణ మాసం పురస్కరించుకొని బుధవారం మజీద్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, ఆరునెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రాధాన్యం, ఆరునెలల ప్రాయం నిండిన పిల్లలకు అనుబంధ ఆహారంపై ఐసీడీఎస్ నాచారం సెక్టార్ సూపర్‌వైజర్ సునీత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లతశివరాములు, ఏఎన్‌ఎం ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్లు యాదవ్వ, భాగ్య పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతుల రుణాలు మాఫీ చేయాలని, 24 గంటల కరెంట్ సరఫరా చేయాలని, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పరశురాములు, జిల్లా అధికార ప్రతినిధి భూమేశ్‌గౌడ్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు రైతులకు లక్ష వరకు రుణమాఫీ చేయాలన్నారు. గతంలో ఇచ్చినట్లు వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ ఇవ్వాలన్నారు. జొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ కుమార్, మహేశ్, రంగాచారి, రాజిరెడ్డి, శ్రీనివాస్, రమేశ్, రవీందర్, సాయికిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండ



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని గణేశ్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్త పద్మ కొన్నినెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమెకు బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉన్నందున రెండు లక్షల రూపాయలు మంజూరు కాగా బుధవారం ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీ నరేందర్, ఉపసర్పంచ్ మహేశ్, నాయకులు శ్రీరాములు, రామరాజు, బాలస్వామి, అనిల్, నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

కోహెడ(హుస్నాబాద్): అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి భూమయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోహెడ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 1037లో ప్రైమరీ విచారణ చేయకుండానే వందలాది ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడి ఓ సంపన్నుడుకి అక్రమ పట్టా చేసినట్లు ఆరోపించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు పెరిగాయన్నారు. ప్రభుత్వానికి రాబడిపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదన్నారు. మండలంలోని గ్రామాల వారీగా పూర్తిస్థాయిలో ప్రభుత్వ భూముల వివరాలు ఇవ్వాలని తీన్మార్ మల్లన్న టీం కోహెడ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఆర్టీఐ ద్వారా దరఖాస్తు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజు, సంజీవ్, మల్లేశం పాల్గొన్నారు.

నిరుపేద వధువుకు చేయూత

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని నిరుపేద వధువు భవాని వివాహానికి ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం రూ. 30వేల ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, నాయకులు పిట్ల ఆంజనేయులు, కొట్టాల శ్రీనివాస్, చింత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం

- అధికారుల తప్పిదంతో ఇబ్బందులు
- అక్కన్నపేట మండల సభలో ప్రజాప్రతినిధుల ఆవేదన



అధికారులతో సర్పంచ్‌ల వాగ్వాదం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వం చెప్పిన పనులన్నీ చేస్తున్నా.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామే తప్పా బిల్లులు మాత్రం రావడం లేదని సర్పంచ్‌లు మండిపడ్డారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మాలోతు లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభమైనా మధ్యాహ్నం వరకు ఒకరిద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. దీంతో కార్యాలయం ఖాళీ కుర్చీలతో విలవిలబోయింది. మధ్యాహ్నం తర్వాత సమావేశానికి సర్పంచ్‌లు హాజరయ్యారు.

- 'మన ఊరు–మన బడి' కింద చేసిన పనులకు సైతం బిల్లులు రావడం లేదని, సుమారుగా రూ.9లక్షల పనులు చేస్తే కేవలం రూ.3లక్షల వరకు మాత్రమే బిల్లులు వచ్చాయని కేశవాపూర్ సర్పంచ్ రాజేశం ఆవేదన వెళ్లగక్కారు. పాఠశాలలపై పర్యవేక్షణ లోపంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు.
- 16 నెలలుగా గ్రామ పంచాయతీకి నిధులు రాకపోవడంతో పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వని దయనీయ స్థితిలో ఉన్నామని కుందనవానిపల్లి సర్పంచ్ అన్నాడీ దినేశ్‌రెడ్డి సమావేశంలో తన బాధను వెళ్లగక్కారు.
- ఈ విషయంపై డీపీఓకు 100సార్లు కలిసి విన్నవించుకున్నా తన సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు.
- పారిశుధ్య కార్మికులు జీతాలు ఇవ్వాలని రోజూ ఇంటికి వస్తున్నారని వారికి ఏం చెప్పాలో అర్థం కాక తప్పించుకొని తిరుగుతున్నానని బోరుమన్నాడు.
- అధికారులు చేసిన తప్పుకు తమ జీపీకి నిధులు జమ కావడంలేదని, గట్టిగా అడిగితే 'జీపీ అకౌంట్ టెక్నికల్ ప్రాబ్లం' అంటున్నారే తప్పా పరిష్కరించడం లేదని మండిపడ్డారు.

అంగన్‌వాడీ సీడీపీఓపై చర్యలకు డిమాండ్

- ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ లేక దారి తప్పిందని, సర్వసభ్య సమావేశానికి సీడీపీఓ ఎందుకు రావడం లేదని ఎంపీటీసీ పెసరు సాంబరాజు, కేశనాయక్‌తండా సర్పంచ్ భానోతు రవీందర్ ప్రశ్నించారు.
- ఇటీవల జరిగిన ఆయా, టీచర్ల పోస్టుల నియామకంలో అవినీతి జరిగిందని, అర్హత లేని వారిని నియమించారని వారు ఆరోపించారు. నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు బాలింతలకు, గర్భిణులకు సరుకులు ఇవ్వడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. సీడీపీఓపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచ్‌లు డిమాండ్ చేశారు.

గజ్వేల్, సిద్దిపేట వారికే బిల్లులు చెల్లింపు..

- గ్రామాల్లో అభివృద్ధి పనులకు గజ్వేల్, సిద్దిపేటకు పనులు పూర్తికాక ముందే బిల్లులు వచ్చేస్తున్నాయని, హుస్నాబాద్ నియోజకవర్గంలో సంవత్సరాలు గడిచినా బిల్లులు రావట్లేదని కేశవాపూర్ సర్పంచ్ బొమ్మగాని రాజేశం, కేశనాయక్ తండా సర్పంచ్ భానోతు రవీందర్‌లతో పాటు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మాకో న్యాయం.. గజ్వేల్, సిద్దిపేటకో న్యాయమా? అని అధికారులను నిలదీశారు.
- అనంతరం ఎంపీపీ మాలోతు లక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, త్వరలో అన్నీ బిల్లులకు నిధులు విడుదల అవుతాయని చెప్పారు.
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసుకోవాలన్నారు. మండల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు.
- కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగ, మార్కెట్ చైర్‌పర్సన్ రజని, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

- చేసిన పనులకు బిల్లులు రావడంలేదని సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచ్‌లు



నివేదిక చదివి వినిపిస్తున్న వ్యవసాయాధికారి మోహన్

తొగుట(దుబ్బాక): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సర్పంచ్‌లు బహిష్కరించారు. ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సభ ప్రారంభం కాగానే చందాపూర్ సర్పంచ్ నర్సింలు మాట్లాడుతూ.. బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వ చర్యలకు నిరసనగా సమావేశాన్ని బహిష్కరిస్తున్నామంటూ బయటకు వెళ్లిపోయారు. అనంతరం తొగుట, కాన్గల్, ఎల్.బంజేరుపల్లి, పెద్ద మాసాన్‌పల్లి, లింగంపేట, తుక్కాపూర్ సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, ప్రేమలచంద్రారెడ్డి, మంజుల సత్యనారాయణ, వరలక్ష్మీస్వామి, రేణుకనర్సింలు, చంద్రంలతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీ ఖాతాలను ప్రభుత్వం ఫ్రీజ్‌లో ఉంచడం అన్యాయమన్నారు. అప్పుల పాలైన కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత ఎంపీపీ కార్యాలయం నుంచి సర్పంచ్‌లు వెళ్లిపోయారు. సర్పంచ్‌లు వెళ్లిన తర్వాత సభ యథావిధిగా కొనసాగింది. వివిధ శాఖల అధికారులు తమ నివేదికను చదివారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న సమస్యలను జెడ్పీ సమావేశంలో లేవనెత్తి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు వెలుపుల స్వామి, కంకనాల నర్సింలు, మాష్టి సుమలత, ఏఎంసీ చైర్మన్ దోమల కొమురయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల పునఃప్రతిష్ఠ



ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న అర్చకులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్లలో మహాలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంతో పాటు ఆలయంలో నంది, వినాయక విగ్రహాల పునఃప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా మొదటిరోజు బుధవారం యాగం, హోమం చేశారు. ఈ నెల 19 వరకు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు జరుగుతాయని సర్పంచ్ తోడిటి రమేశ్ తెలిపారు. ఆలయ నిర్మాణానికి గ్రామస్తులతో పాటు ఇక్కడ పుట్టిపెరిగి వేరేచోట స్థిరపడిన వారు విరాళాలను అందిస్తున్నారు.

చెరువుల్లో మోటార్లను తొలగించండి



వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మడద, రాములపల్లి ఊర చెరువుల్లో కొందరు అక్రమంగా విద్యుత్ మోటార్లు వేసి నీరును అక్రమంగా తోడేస్తున్నారని మత్స్యకారులు బుధవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘ నాయకుడు పెండ్యాల అయిలయ్య మాట్లాడుతూ.. చెరువులో చేపలను పెంచుకొని జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన చేపపిల్లలను చెరువులో వేసుకుంటే నీటిని తోడేయడంతో చేపలు మరణించే ప్రమాదం ఉందన్నారు. చెరువే ఆధారంగా బతుకుతున్న మాకు చేపలు మరణిస్తే ఆర్థిక నష్టం జరగడంతో పాటు మాకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తక్షణమే చెరువుల నుంచి అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షుడు సంపత్, పొన్నబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ బ్రాంచ్ ఏర్పాటు చేయాలి



సీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): మండల పరిధిలోని నర్మేటలో ఎస్‌బీఐ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ సర్పంచ్ అజీద్ ఆధ్వర్యంలో బుధవారం బ్యాంక్ సీజీఎమ్ అమిత్ జింగురాన్‌కు హైదరాబాద్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజీద్ మాట్లాడుతూ.. గ్రామంలో బ్యాంకులు లేనందున తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. మంత్రి హరీశ్‌రావు కృషితో నర్మేటలో ఆయిల్‌ఫెడ్ పరిశ్రమ ఏర్పాటు కానుందని, జనాభా ఎక్కువగా ఉండడంతో పాటు సానుకూల వాతవరణం ఉందన్నారు. దీనికి స్పందించిన సీజీఎమ్ గ్రామస్తుల వినతిని పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ నీరజ, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



క్రీడాకారులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐలు

చేర్యాల(సిద్దిపేట): క్రీడలు మానసికోల్లాసం పెంపొందించేందుకు దోహదపడతాయని సీఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వీరన్నపేటలో నిర్వహిస్తున్న వీరన్నపేట ప్రీమియర్ లీగ్‌ను చేర్యాల, కొమురవెల్లి ఎస్‌ఐలు భాస్కర్‌రెడ్డి, చంద్రమోహన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా శారీరక, మానసిక ఉల్లాసం పొందాలంటే క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడా పోటీల నిర్వాహకులను అభినందించారు. ఆటలు సరదాగా ఆడి విజయం సాధించాలి తప్పా ఎలాంటి గొడవలకు పోవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపాక భిక్షపతి, ఎంపీటీసీ ఎలికట్టే శివశంకర్, క్రీడాపోటీల నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

'కేటీఆర్ బహిరంగ సభకు తరలిరండి'



మహిళకు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: పట్టణంలో ఆర్టీసీ బస్ డిపో గ్రౌండ్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించే మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు మహిళలు తరలిరావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కోరారు. పట్టణంలోని 15వ వార్డులో బుధవారం ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టు పెడుతూ బహిరంగ సభకు రావాలని ఆహ్వానించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు నళినిదేవి, బోజు రమాదేవి, కల్పన, రత్నమాల, సుప్రజ, లలిత, శ్రీలత, వార్డు మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు మోహన్‌బాబు, సింగాయపల్లి సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం



మేడిపల్లిలో శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మేడిపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తూ ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో విశ్వాసం పెంచిందన్నారు. ప్రతి పేదవాడికి వైద్యం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 183 గ్రామాలు, 62 వార్డుల్లో వైద్యపరీక్షలు పూర్తయ్యాయన్నారు. 50, 750 మందికి రీడింగ్ అద్దాలు, 40, 160 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సదానందం గౌడ్, సర్పంచ్ సరితసంపత్, రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశం, ఎంపీడీఓ శ్రీనివాస్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భానుప్రకాష్‌రావు, ఎంపీపీ బాలేషం గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీ మంజుల, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, నాచారం డైరెక్టర్ నాగరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, ఉపసర్పంచ్ ఐలయ్య, మాజీ సర్పంచ్ కరుణాకర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

మద్దూరు(హుస్నాబాద్): 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఖర్చు చేసేందుకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(జీపీడీపీ), బాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(బీపీడీపీ) రూపొందించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ ప్రణాళికలపై వివిధ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఉమ్మడి మద్దూరు మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం రూ.2,21,22,336లు, మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.26లక్షల 64వేలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను ఏ పనుల కోసం ఖర్చు చేయాలో ప్రణాళికలు రూపొందించి, ఈ నెలాఖరు వరకు ఈ–గ్రామ్ స్వరాజ్ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో వెంకటేశ్వర్లు, పీఆర్‌ఏఈ విజయ్‌రెడ్డి, ఈసీ పరశురాములు, వైద్యాధికారి రజిత తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ఉమాపార్థీవ కోటిలింగేశ్వర స్వామి క్షేత్రంలో బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. 50 రోజులుగా భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సూపరింటెండెంట్ శివరాజు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి రవికుమార్, సిద్దిపేట దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ చైర్మన్ తడ్కమడ్ల ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో లెక్కించగా ఆదాయం రూ.1,98,784లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరామ్ జయంతి



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సిద్దిపేటకమాన్: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 89వ జయంతిని నియోజకవర్గ ఇన్‌చార్జి బాకురి అశోక్ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణం అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను ఏకం చేయడానికి, బహుజన సిద్ధాంతాన్ని ప్రజలకు చేరవేయడానికి కాన్షీరామ్ తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో లింగంపల్లి యాదగిరి, బాబు, నర్సింలు, స్వామి, మల్లేశం, రాకేశ్, కిరణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బీఎస్పీ మండల అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో బెజ్జంకిలో బుధవారం కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిశాని రామచంద్రం, అసెంబ్లీ అధ్యక్షుడు ప్రభాకర్, రాజమల్లు, కోశాధికారి వెంకన్న, నరేశ్, పరశురాములు, మధు పాల్గొన్నారు.

మురికి కాల్వకు మరమ్మతులు చేపట్టండి



ధ్వంసమైన మురికి కాల్వను చూపిస్తున్న స్థానికులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో 8వ వార్డులో ధ్వంసమైన మురికి కాల్వకు మరమ్మతులు చేపట్టాలని పలువురు స్థానికులు కోరారు. బుధవారం ధ్వంసమైన మురికి కాల్వ వద్ద వారు మాట్లాడుతూ.. కాల్వ ధ్వంసం కావడంతో కాలనీ నుంచి తొమ్మిదో వార్డు, దూళ్మిట్ట మండల కేంద్రానికి వెళ్లే మార్గానికి ఆటంకంగా మారి రాకపోకలకు ఇబ్బంది అవుతుందన్నారు. సమస్యను సర్పంచ్, కార్యదర్శి, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని లేనిపక్షాన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు సత్యనారాయణ, రాజేశ్వరి, మాతమ్మ, శోభ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం



దుబ్బాకలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ కృష్ణ, ఎస్‌ఐ మహేందర్

దుబ్బాకటౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం దుబ్బాక పట్టణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కావడంతో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్ష సమయానికి ముందే సెంటర్ వద్దకు చేరుకొని తమ హాల్ టికెట్లను సరిచూసుకోవడం కనిపించింది. పరీక్ష సెంటర్లను సీఐ కృష్ణ, ఎస్‌ఐ మహేందర్‌లు బందోస్తును ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించారు.

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 305 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 11 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 294 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అడిషినల్ కలెక్టరు శ్రీనివాస్‌రెడ్డి పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షలు రాసే విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తూ పరీక్షా కేంద్రంలోకి పంపారు. విజయజ్యోతి అనే విద్యార్థిని అనారోగ్యం కారణంగా స్థానిక వైద్యులతో పరీక్షలు చేయించి పరీక్షలు రాయించారు. విద్యార్థిని పరిస్థితిని అడిషినల్ కలెక్టరు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాన్ని సందర్శించి చీఫ్ సూపరింటెండెంట్ ఇందిరాదేవికి ఆయన పలు సూచనలు చేశారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలో మొత్తం 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా బాలుర హబ్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రానికి నలుగురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో వారిని తిరిగి పంపించారు.